సాక్షి
తిరుపతి

మంగళవారం । 30 । జనవరి । 2024



అతివల అభ్యున్నతికే 'ఆసరా'

మహిళల అభ్యున్నతికే ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ భూమన తెలిపారు. - 8లో



జూపార్క్‌కు 12 జంతువులు

ఎస్వీ జూ పార్క్‌కు సోమవారం చత్తీస్‌గఢ్ నుంచి కొత్తగా 12 జంతువుల వచ్చినట్లు క్యూరేటర్ తెలిపారు. - 8లో



పరిశ్రమల భాగస్వామ్యం అవసరం

విద్యతో పరిశ్రమల భాగస్వామ్యం అవసరమని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

విభిన్నప్రతిభావంతుడికి వినికిడి పరికరం



లబ్ధిదారుకు పరికరం అందిస్తున్న డీఆర్‌ఓ

తిరుపతి అర్బన్: వెంకటగిరి పురపాలక పరిధిలోని బంగారుపేటకు చెందిన శివ అనే విభిన్న ప్రతిభావంతుడికి సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ పెంచల కిషోర్ చేతుల మీదుగా వినికిడి పరికరం అందజేశారు. ఇటీవల వెంకటగిరి పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి శివ తన సమస్యను తీసుకు వెళ్లాడు. దీనిపై సీఎం వెంటనే స్పందించి రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. అలాగే వినికిడి పరికరం సైతం మంజూరు చేయాలని ఆదేశించారు. ఆ మేరకు పరికరం అందజేయడంతో లబ్ధిదారు హర్షం వ్యక్తం చేశాడు. ఇచ్చిన మాట ప్రకారం చేయూతనందించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖాధికారి వినోద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, భవానీ పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలకు అధిక ప్రాధాన్యం



అర్జీలు పరిశీలిస్తున్న డీఆర్‌ఓ పెంచల కిషోర్

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందనలో వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యమివ్వాలని డీఆర్‌ఓ పెంచల కిషోర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్పందన కార్యక్రమం చేపడుతోందని వెల్లడించారు. ప్రజలు అందించిన వినతుల్లోని సమస్యలను వాయిదాలు వేయకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ ఇబ్బందులపైనే ఎక్కువ అర్జీలు వస్తున్నాయని, భూ సర్వే పూర్తయితే అవి తగ్గే అవకాశముందన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసరావు, కేవీ శ్రీనివాస్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవానీ పాల్గొన్నారు. స్పందనలో మొత్తం 201 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కలెక్టరేట్ వద్ద ఆప్కో స్టాల్‌కు విశేష స్పందన లభించింది.

రేపు శ్రీకాళహస్తిలో జాబ్‌మేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జేకేసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎం.శ్రీలత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ చెన్నైకు చెందిన ఓ కంపెనీలో టెలీకాలర్ పోస్టులకు గాను నిర్వహించే ఇంటర్వ్యూలకు గ్రాడ్యుయేట్లు, నాన్ గ్రాడ్యుయేట్లు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన వారికి రూ.15వేల వేతనం, అలవెన్సులు, హాస్టల్ వసతి ఉంటుందని వివరించారు. అలాగే ఆక్సోరా రీసోర్స్ పరిశ్రమలో బీఎస్సీ కెమిస్ట్రీ ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూలు ఉన్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.25వేలు వేతనం ఇస్తారని వెల్లడించారు. ఆసక్తి గలవారు బుధవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 94405023384, 9884304026 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



వెంకటగిరిలోని టిడ్కో ఇళ్ల సముదాయం (ఇన్‌సెట్) ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి తదితరులు



స్వగృహ సంబరం

ఏళ్ల తరబడి ఎదురుచూపులకు ఫలితం దక్కింది.. ధనికులకే పరిమితమైన ఆకాశ హర్మ్యం అందుబాటులోకి వచ్చింది.. ఆధునిక వసతులతో ఆవాసం సమకూరింది.. పేదల సొంతింటి స్వప్నం సాకారమైంది.. ఆడపడుచుల్లో హర్షాతిరేకం అవధులు దాటింది.. మాట చెల్లించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అభిమానం ఇనుమడించింది.. సోమవారం ఈ మేరకు వెంకటగిరిలో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం అట్టహాసంగా సాగింది.. పండుగ వాతావరణంలో లబ్ధిదారుల స్వగృహ ప్రవేశం జరిగింది.

- వెంకటగిరిలో టిడ్కో ఇళ్లు ప్రారంభం
- 1,008 మంది లబ్ధిదారులకు పంపిణీ
- కల సాకారమైందని ఆడపడుచుల ఆనందం
- సీఎం వైఎస్ జగన్‌పై 'గూడు' కట్టిన అభిమానం
- ఊళ్లే నిర్మిస్తున్నామన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

సైదాపురం/వెంకటగిరిరూరల్: వెంకటగిరిలో ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల ప్రారంభోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 1,008 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాలు, హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ హాజరయ్యారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒకేసారి 30 లక్షలకు పైగా ఇంటి స్థలాలను మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదల కోసం ఏకంగా ఊళ్లే నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేకే ఎల్లోమీడియా సహకారంతో చంద్రబాబు కుట్రపూరితంగా అడ్డంకులు సృష్టించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. పేదలకు ఇళ్లు కట్టిస్తుంటే కోర్టుకు వెళ్లి మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. అయితే ఎవరెన్ని కుతంత్రాలు పన్నినా ముఖ్యమంత్రి జగనన్న లెక్కచేయకుండా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్నారని వెల్లడించారు. గత టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను పట్టించుకోలేదని, ఉన్నత పదవులను ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్‌తో చంద్రబాబు లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని కుటుంబాల్లో చిచ్చుపెడుతున్నారని తెలిపారు. రాజకీయ స్వార్థంతోనే షర్మిలమ్మతో అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని స్పష్టం చేశారు. చంద్రబాబు మాయమాటలకు ఎవరూ మోసపోవద్దని కోరారు. సాధ్యం కాని హామీలతో మళ్లీ ప్రజలను బురిడీ కొట్టించాలని యత్నిస్తున్నారని వివరించారు. పొత్తులతో, కడుపులో కత్తులతో వచ్చినా, పేదల తలరాతను మార్చిన జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే రామ్‌కుమార్‌రెడ్డికి వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు అండగా నిలబడాలని కోరారు. అనంతరం రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 1,008 టిడ్కో గృహాలను పేదలకు తన చేతుల మీదుగా అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. టిడ్కో కాలనీ ఎదురుగానే నగరవనం అభివృద్ధి చెందుతుందని, ఇక్కడికి సమీపంలోనే కళాశాలలు కూడా ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. త్వరలోనే ఈ ప్రాంతం మరో పట్టణంగా రూపుదిద్దుకుంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ అక్కచెల్లెమ్మల సొంతింటి కలను ముఖ్యమంత్రి జగనన్న సాకారం చేస్తున్నారని తెలిపారు. సర్వజ్ఞ కుమారయాచేంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ, టిడ్కో ఎస్ఈ జాన్స్ సైమన్ రావు, ఈసీ ఉమాశంకరశాస్త్రి, పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి దేవికా చౌదరి, పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారుకు ఇంటి తాళం అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, టిడ్కో చైర్మన్



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నేదురుమల్లి



సభకు హాజరైన నేతలు, లబ్ధిదారులు

"

మాకు పండుగ



టిడ్కో కాలనీ మరో వెంకటగిరిని తలపిస్తోంది. ఇన్నేళ్లుగా అద్దె ఇంట్లో నివసించే వాళ్లం. జగనన్న పుణ్యమా అని చక్కటి వసతులు ఉన్న ఇంట్లోకి వచ్చాం. ఇలాంటి గృహంలో ఉండగలమని ఎప్పుడూ అనుకోలేదు. ఈ రోజు నిజంగా మాకు పండుగే. పేదల పక్షాన నిలబడే జగనన్న వెంటే ఉంటాం. జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటాం.

– కొండమ్మ, లబ్ధిదారు, వెంకటగిరి

సంతోషంగా ఉంది



ఆధునిక సౌకర్యాలతో ఉన్న ఇల్లు అందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగంగా జరిగింది. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షించేవారు. మా కల సాకారమైనందుకు చాలా సంతోషంగా ఉంది. ఇచ్చిన మాట నిలబెట్టుకుని, మాకు చక్కటి ఇంట్లో నివసించే అవకాశమిచ్చిన జగనన్నకు కృతజ్ఞతలు.

– సాయిప్రసన్న, లబ్ధిదారు, వెంకటగిరి

మేలు మరువలేం



రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు మావి. సుమారు 35 ఏళ్లుగా అద్దె ఇళ్లలోనే ఉంటున్నాం. సీఎం జగనయ్య చల్లగా చూడబట్టి సొంతింటికి చేరుకున్నాం. డబ్బున్న వాళ్ల కాలనీల స్థాయిలో మా ఇళ్లు ఉండే ప్రాంతాన్ని తీర్చిదిద్దారు. చక్కటి ఇల్లు అందించిన ముఖ్యమంత్రి మేలు మరువలేం.

– మంజులమ్మ, లబ్ధిదారు, వెంకటగిరి

యుద్ధం.. 'సిద్ధం'



సిద్ధం పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, ఉషశ్రీచరణ్ తదితరులు

- తిరుపతిలో వైఎస్సార్‌సీపీ రాయలసీమ నేతల సమావేశం

సాక్షి, తిరుపతి : ఎన్నికల యుద్ధానికి వైఎస్సార్‌సీపీ నేతలు సన్నద్ధమయ్యారు. సోమవారం ఈ మేరకు తిరుపతిలోని పీఎల్‌ఆర్ కన్వెన్షన్ హాల్లో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల నేతలు, ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, నియోజక వర్గ సమన్వయకర్తలు హాజరయ్యారు. కుప్పంతో సహా రాయలసీమలోని అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించారు. అనంతపురంలో నిర్వహించనున్న 'సిద్ధం' సభను నభూతో నభవిష్యత్ అన్నట్టు విజయవంతం చేయాలని సంకల్పించారు.

కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు రిశాంత్‌రెడ్డి



చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డిని కౌంటర్ ఇంటెలిజెన్స్ ఎస్పీగా సోమవారం బదిలీ చేశారు. అలాగే తిరుపతిలోని ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగానికి ఇన్‌చార్జిగా సైతం నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలోనే కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న జాషువాను చిత్తూరు జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు పేర్కొంది. 2013లో పలమనేరు డీఎస్పీగా జాషువా పనిచేశారు.

ఆరోగ్య రక్షణకే పౌష్టికాహారం



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లులతో మాట్లాడుతున్న ఇందీవర్ పాండే

తిరుపతి అర్బన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య రక్షణకే ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఇందీవర్ పాండే తెలిపారు. సోమవారం తిరుపతిలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మితో కలిసి పర్యటించారు. ముందుగా తిరుచానూరు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి రైల్వే స్టేషన్‌లో చైల్డ్ హెల్ప్ డెస్క్ సెంటర్ అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమంది తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించారనే విషయాలను తెలుసుకున్నారు. అనాథ పిల్లలను ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పించాలని కోరారు. అనంతరం రాజన్న పార్క్ సమీపంలోని మూడు అంగన్‌వాడీ సెంటర్లు, బాలిక హాస్టల్‌ను సందర్శించారు. పిల్లల తల్లులతో సమావేశం నిర్వహించారు. బేటీ బచావో బేటీ పడావో, బాల్య వివాహాల నిషేధంపై పోస్టర్లు విడుదల చేశారు. సామూహిక సీమంతాలు, అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. పోషణ అభియాన్ పథకం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు తీరును ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, జేజే బోర్డు చైర్మన్ ప్రసాద్‌మూర్తి, సీడీపీఓ సుధారాణి, డీసీపీఓ శివశంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'గ్యారెంటీ' బాబులకు చుక్కెదురు!



దేటా సేకరణకు వచ్చిన టీడీపీ కార్యకర్తలు

చిల్లకూరు : గ్యారెంటీ పథకాల ప్రచారం పేరుతో మభ్య పెట్టేందుకు వచ్చిన టీడీపీ కార్యకర్తలకు సోమవారం చిల్లకూరు మండలంలో చేదు అనుభవం ఎదురైంది. మండలంలోని చేడిమాల పంచాయతీ నల్లాయగారిపాళానికి వచ్చిన కొందరు తెలుగు తమ్ముళ్లు కొత్త పథకాలు అందిస్తామని గ్రామస్తులను మోసం చేసేందుకు యత్నించారు. ఆధార్ నంబర్లు సేకరిస్తూ ఓటీపీ చెప్పండి.. పథకాలు అందుకోండి అంటూ మాయమాటలు వల్లించారు. ఇంటింటికీ వెళ్లి ఆధార్ నంబర్ అడుగుతూ ఓటీపీ చెప్పమని కోరడంతో మహిళలు భయాందోళనకు గురయ్యారు. భవిష్యత్‌లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, ఇప్పుడు వివరాలు నమోదు చేసుకున్న వారికి ఏటా రూ.20లక్షల వరకు సంక్షేమ పథకాలు వస్తాయని నమ్మబలుకుతున్నారు. దీనిపై ఆగ్రహించిన గ్రామస్తులు సదరు టీడీపీ కార్యకర్తలను అడ్డుకుని ఊరి నుంచి తరిమేశారు. ఈ సందర్భంగా తొణుకుమాల ఎంపీటీసీ సభ్యుడు జానకిరామ్ మాట్లాడుతూ ప్రజలను పక్క దారి పట్టించేలా టీడీపీ నేతలు ఇలాంటి ఎత్తు గడలు వేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల వ్యక్తిగత సమాచారం సేకరించడం ఏంటని ప్రశ్నించారు. ఇలా గ్యారెంటీ స్కీమ్‌ల పేరుతో వచ్చేవారిని ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

అతివల అభ్యున్నతికే 'ఆసరా'



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష



కార్యక్రమానికి కదలివచ్చిన మహిళాలోకం

తిరుపతి తుడా : మహిళల అభ్యున్నతికే ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తున్నట్లు టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతి తుడా సర్కిల్‌లో నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ పేదలు ఆర్థికాభివృద్ధి సాధించాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ గెలవాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా అక్కా చెల్లెమ్మల రుణాలు మాఫీ చేసిన రాజనీతిజ్ఞుడు జగనన్న అని కొనియాడారు. మహిళా సాధికారతతోనే ఉన్నత సమాజం సాధ్యమని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను రెండు కళ్లుగా అమలు చేస్తూ జగనన్న సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. మీకు మేలు జరిగి ఉంటేనే మాకు ఓటేయాలని కోరారు. నవీన తిరుపతి ఆవిష్కరణలో మా నిజాయితీ, కమిట్‌మెంట్‌ను అర్థం చేసుకోవాలన్నారు. ఒకప్పుడు ఆటోలు కూడా వెళ్లలేని కొర్లగుంట, గంగమ్మ గుడి వంటి ప్రాంతాల్లో 40, 60, 80 అడుగుల రోడ్లు వేయించామని వివరించారు. మేయర్ శిరీష మాట్లాడుతూ రాజకీయ పదవుల్లో 50 శాతం, ప్రైవేట్ ఉద్యోగాల్లోనూ మహిళలకు రిజర్వేషన్ తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సంక్షేమ పాలనను సంరక్షించుకోవాలని కోరారు. అనంతరం డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కృష్ణవేణి, కార్పొరేటర్లు తిరుపతి ముని రామిరెడ్డి, దూది కుమారి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రుద్రరాజు శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు తలారి రాజేంద్ర, మద్దాలి శేఖర్, దూది శివ రాయల్, వెంకట ముని, గీతా యాదవ్, సాయి కుమారి, పునీతమ్మ, పుష్ప యాదవ్ పాల్గొన్నారు.

'మీ కోసం.. మీ మోహిత్' ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి : తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి మద్దతుగా పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులు ప్రత్యేకంగా మీ కోసం.. మీ మోహిత్ లోగో రూపొందించారు. సోమవారం మండలంలోని నరసింగాపురంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి చేతులమీదుగా లోగో ఆవిష్కరించారు. సెల్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ స్టిక్కర్ అంటించుకుని మోహిత్ రెడ్డికి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

అవగాహనతోనే సైబర్ నేరాల కట్టడి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : సైబర్ నేరాల కట్టడికి అవగాహనే ఆయుధమని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ఏపీ సీఐడీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన మాట్లాడారు. సమాజంలో సులభంగా నగదు సంపాదించేందుకు కొందరు సైబర్ నేరగాళ్లుగా మారుతున్నారన్నారు. పేదల బలహీనతలు, ఆశలను ఆసరా చేసుకుని దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టార్జితాన్ని కాపాడుకోవాలంటే సెల్ ఫోన్లపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్స్‌పై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఇలాంటి అవగాహన సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.సీఐడీ ఎస్పీ ఎంపీఎస్ స్వామి మాట్లాడుతూ సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు, నిత్యం ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో వ్యక్తులే కాకుండా కొన్ని సంస్థలు సైతం సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవడం చూస్తున్నామని వెల్లడించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు హెల్ప్‌లైన్ 1930 ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో ఐఎస్ఎన్‌సీఎస్ డైరెక్టర్ రవిశంకర్, ఎల్‌ఎల్ నరసింహారావు, సీఐడీ డీఎస్పీ పద్మలత, అధికారులు పీఎస్‌వీ రామకిషోర్, ఎమ్‌వీ రమణ, రవినాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్‌వీ టూర్ అండ్ ట్రావెల్స్ 'ఎక్స్‌పో'



మాట్లాడుతున్న ఆర్‌వీ సంస్థల అధినేత రమణ

తిరుపతి కల్చరల్ : ఆధ్యాత్మిక, సాహస యాత్రలు, సోలో ట్రిప్స్‌తో ప్రపంచాన్ని చుట్టి రావాలనుకునే వారి కలను సాకారం చేసేందుకు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ వారు ట్రావెల్ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. సోమవారం ఈ మేరకు సంస్థ అధినేత ఆర్‌వీ రమణ మాట్లాడుతూ 100కు పైగా దేశ, విదేశీ యాత్రలపై భారీ డిస్కౌంట్ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. తిరుమల బైపాస్ రోడ్డులోని ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ట్రావెల్ ఎక్స్‌పో వివరాలు తెలిపారు. వారం పాటు ఆర్‌వీ బ్రాంచ్ కార్యాలయంలో అనుభవజ్ఞులైన సిబ్బందితో ట్రావెల్ ఎక్స్‌పో-2024 నిర్వహించనున్నట్లు వివరించారు. అయోధ్య రామాలయ దర్శనం, కాశీలో మహా శివరాత్రి ఉత్సవాలు, పవిత్ర నర్మదా పుష్కరాలతోఆపటు అతి తక్కువ ధరలోనే బ్యాంకాక్, పట్టాయా టూర్‌కు సంబంధించిన స్పెషల్ టూర్ ప్యాకేజీలు అందిస్తున్నట్లు తెలిపారు. కాశీ, అయోధ్య, నైమిశారణ్యం, అమరనాథ్, దార్దామ్, కైలాస్ మానస సరోవర్, సిమ్లా మనాలి వంటి అనేక విదేశీయ యాత్రలు, ఆస్ట్రేలియా, సింగపూర్, యూరప్, దుబాయ్, బ్యాంకాక్ వంటి మరెన్నో అంతర్జాతీయ యాత్రలకు టూర్ ప్యాకేజీలపై భారీ డిస్కౌంట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు తిరుమల బైపాస్ రోడ్డు, యాక్సిక్ బ్యాంక్ లీలామహల్ బ్రాంచ్ బిల్డింగ్, ఫస్ట్ ఫ్లోర్‌లోని ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ కార్యాలయంలో లేదా, 9121143964ను సంప్రదించాలని సూచించారు.

స్వర్ణరథంపై వరసిద్ధుని విహారం



మాడ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం(యాదమరి): వరసిద్ధి వినాయక స్వామి స్వర్ణ రథంపై ఆలయ మాడ వీధుల్లో విహరించారు. సంకటహర చతుర్థి వ్రతం సందర్భంగా సోమవారం ఉదయం ఆలయంలో వ్రతం నిర్వహించారు. రాత్రి సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామిని అలంకార మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అక్కడి నుంచి ఉత్సవమూర్తులను ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, అధికారులు, ఉభయదారులు అర్చక వేదపండితులు ఊరేగింపుగా తీసుకొచ్చి బంగారు రథంలో కొలువుదీర్చారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో మాడ వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు, ఐరాల జెడ్పీటీసీ సుచిత్ర, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఉపసర్పంచ్ విశ్వనాథ రెడ్డి, చిన్నారెడ్డి, పుణ్యసముద్రం రవి, రవిరెడ్డి, రవిచంద్రా రెడ్డి, శైలజ చరణ్ రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం

వినాయక స్వామి ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి తరువాత నాలుగో రోజు ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతం ప్రతి నెలా నిర్వహించడం సంప్రదాయం. అందులో భాగంగా సోమవారం ఉదయం, సాయంత్రం రెండు పర్యాయాలు ఈ వ్రతం నిర్వహించారు. మొదటగా సిద్ధి, బుద్ధి, సమేత వినా యక స్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, అధికారులు, అర్చక వేదపండితులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆస్థాన మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేద మంత్రాల మధ్య సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. దీనికి హాజరైన భక్తులు భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ వ్రతం ఆచరిస్తే సమస్త దోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఈ వ్రతానికి క్రమంగా ప్రాధాన్యత పెరుగుతూ వస్తోంది. భక్తులు దీనిపై అవగాహన పెంపొందించుకుని తరలివస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, వేదపండితులు అర్చకులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 85,142 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 22,064 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.5.04 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

లారీ ఢీకొని మహిళ మృతి

కోట : మండలంలోని సిద్ధవరం వద్ద సోమవారం రాత్రి లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. వెంకటన్నపాళానికి చెందిన నాగమణి(48) తన భర్త శంకరయ్యతో కలిసి బైక్‌పై కనుపూరుకు వెళ్లింది. తిరుగుప్రయాణంలో ఉండగా ప్రమాదం జరిగింది. తలకు తీవ్రగాయం కావడంతో నాగమణి అక్కడికక్కడే మరణించింది. శంకరయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

దొరవారిసత్రం : మండలంలోని ఉచ్చూరు సమీపంలో ఉన్న గుడిగుంట చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. సూళ్లూరుపేట మండలం మంగళపాగుకు చెందిన హరినాథ్ (43) గురువారం ఇంటి నుంచి వెళ్లాడు. సోమవారం చెరువులో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మద్యం సేవించి మత్తులో చెరువులో పడి పోయి ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూపార్క్‌కు కొత్తగా 12 జంతువులు



జూపార్క్‌కు చేరిన జింకలు

తిరుపతి మంగళం : తిరుపతి శ్రీవేంకటేశ్వర జూపార్క్‌కు చత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ నుంచి 12 కొత్త జంతువులు సోమవారం తీసుకువచ్చారు. అందులో రెండు నక్కలు, నాలుగు థామిన్ జింకలు, ఆరు అడవి జింకలు ఉన్నట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. ఇదివరకే నీటి ఏనుగు వచ్చిందని, త్వరలోనే జిరాఫీ, జీబ్రాను సైతం తీసుకురానున్నట్లు వెల్లడించారు

కట్టుకున్నోడే కాలయముడు

- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు

శ్రీకాళహస్తి: ఒక వైపు అనుమానం.. మరో వైపు ఓర్వలేనితనం వెరసి కట్టుకున్నోడే భార్య పట్ల కాలయముడిగా మార్చింది. భార్యను హతమార్చి, ప్రమాదమని చిత్రీకరించాలని చూసి చివరకు లొంగిపోయిన నిందితుడిని సోమవారం ఒకటో పట్టణ పోలీసులు రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. వన్‌టౌన్ సీఐ నరసింహారావు కథనం మేరకు .. వరదయ్యపాళెం పద్మావతీపురం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు గీత అనే మహిళతో వివాహమైంది. వారికి ఓ కుమార్తె ఉంది. ఇద్దరకి విభేదాలు రావడంతో శ్రీనివాస్ తనకు మామ కూతురైన పవిత్రను 18 ఏళ్ల కిందట పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. అన్యోన్యంగా సాగుతున్న వీరి కాపురంలో గత రెండేళ్లుగా కలతలు మొదలయ్యాయి. శ్రీనివాస్ మద్యానికి బానిసగా మారాడు. దీనిపై పవిత్ర ప్రశ్నించడంతో తరచూ గొడవకు దిగేవాడు. ఈ క్రమంలో జనవరి 7వ తేదీన పవిత్రను తీవ్రంగా కొట్టి గాయపరిచి, తిరుపతిలో వైద్యం చేయించాడు. ఈ నెల 23వ తేదీన బస్సులో ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో భార్యాభర్తలు మళ్లీ గొడవపడ్డారు. దీంతో శ్రీనివాస్ ఎలాగైనా భార్యను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. 24న సాయంత్రం పవిత్రను శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని స్వర్ణముఖి నదిలోకి తీసుకెళ్లి స్నానం పేరిట నీట ముంచి చంపేశాడు. అనంతరం తెలివిగా తన భార్య స్నానానికి వెళ్లి నీటిలో మునిగి మరణించిందంటూ అత్తామామలకు సమాచారం అందించాడు. అయితే శ్రీనివాస్ మాటలను మృతురాలి తల్లిదండ్రులు నమ్మలేదు. అదేరోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేసిన పోలీసులకు అసలు నిజాలు తెలిసిపోవడంతో శ్రీనివాస్ తానే వచ్చి లొంగిపోయాడు. కేసు నమోదు చేసి శ్రీనివాస్‌ను రిమాండ్ నిమిత్తం శ్రీకాళహస్తి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.


విద్యుత్ సిబ్బందిపై దాడి



తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న బాధితులు

రేణిగుంట : స్థానిక గణేష్‌నగర్‌లో కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించేందుకు వస్తున్న విద్యుత్ సిబ్బందిపై కొందరు యువకులు దాడి చేసి గాయపరిచారు. వివరాలు.. లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుతో సహా పది మందితో కూడిన బృందం వాహనంలో వస్తుండగా ఓ యువకుడు బైక్‌ను తీసుకొచ్చి అడ్డుగా పెట్టారు. బైక్ పక్కకు తీయాలని ట్రాన్స్‌కో సిబ్బంది కోరడంతో మిత్రులతో కలిసి దాడికి దిగాడు. దీంతో శ్రీనివాసులు, రవి, ఉదయ్, దాము, శంకర్, రమణ గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. నిందితులు గంజాయికి అలవాటు పడిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యతో పరిశ్రమల భాగస్వామ్యం అవసరం



మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు : విద్యతో పరిశ్రమల భాగస్వామ్యం వల్ల పరస్పర ప్రయోజనాలు ఉంటాయని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో పరిశ్రమ-అకాడెమియా ఇంటరాక్షన్ ఈవెంట్ నిర్వహించారు. ఎల్అండ్‌టీ, అమరరాజా గ్రూపు, యురేనియం కార్పొరేషన్, మ్యాథ్‌వర్క్స్, బయోకన్ యూనిలెవర్ తదితర డొమైన్‌ల నుంచి నిపుణులు ఎగ్జిబిట్‌లు ప్రదర్శించారు. కెమికల్ ఇంజినీరింగ్ రంగంలో ప్రస్తుత పోకడలు, సవాళ్లు, అవకాశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. డైరెక్టర్ మాట్లాడుతూ కెమికల్ ఇంజనీరింగ్ విభాగం తమ పరిశోధన, విద్యా కార్యకలాపాలను ప్రదర్శించడానికి, వివిధ పరిశ్రమలతో సహకారాన్ని పెంపొందించడానికి ఇలాంటి ఈవెంట్లు ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఐఐటీ తిరుపతి, పరిశ్రమ భాగస్వామ్యంపై చర్చించారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.